ఎన్‌యూలో అడ్మిషన్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంతో పాటు పలు చోట్ల తరగతులు నిర్వహిస్తున్న నీట్ విశ్వవిద్యాలయం (ఎన్‌యూ), రానున్న విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లను అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సైబర్ సెక్యూరిటీలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వంటి కొత్త కోర్సులతో పాటు కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో బీటెక్, బయోటెక్నాలజీలో బీటెక్, 3, బీబీఏ 4 సంవత్సరాల ఎంబీఎల కోసం అడ్మిషన్లు అందిస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం https://niituniversity.in/ admissions లో లాగిన్ కావాలని సూచించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 23, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

హనుమాన్ సినిమా వీక్షణ



రాంగోపాల్‌పేట్: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు నేటి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పల్లవి గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ ముల్క కొమురయ్య అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం కొమురయ్య ఆధ్వర్యంలో అంజలి థియేటర్‌లో విద్యార్థులతో కలిసి హనుమాన్ సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్య రామ మందిర ప్రతిష్ఠతో 500 ఏళ్ల కల నెరవేరుతుందని, హనుమాన్ సినిమా సైతం ప్రజలను ఆకట్టుకుంటుందన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల్లోని ఔన్నత్యం, అయోధ్య రామ మందిర చరిత్ర చాటి చెప్పేలా తమ వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు

చిక్కడపల్లి: నిత్యం సినీ పాటలతో హోరెత్తే త్యాగరాయ గానసభ ఆదివారం రాత్రి మహా మహా శాస్త్రీయ సంగీతజ్ఞులు ప్రవర్ధమాన బాల గాయకుల గాన మాధుర్యంతో పులకరించింది. సుస్వర సంగీత వేదిక సారథ్యంలో ప్రముఖ వాగ్గేయ కారుడు త్యాగరాజ స్వామి విరచిత కీర్తనలు పలువురు గానం చేశారు. త్యాగరాజ కీర్తనలతో గానసభ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



జెకెకాలనీ లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్స్ ముందు భోగి మంటలు

భోగి మంటలు.. రంగవల్లులు

సనత్‌నగర్: తెల్లవారకముందే 'భోగి మంటలతో సంక్రాంతి పండుగకు ప్రజలు స్వాగతం పలికారు. పల్లె సంస్కృతికి అద్దం పట్టేలా అపార్ట్‌మెంట్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి పూలతో అలంకరించారు. సనత్‌నగర్ ఎస్ఆర్‌టీకాలనీ, అశోక్‌కాలనీ, జెకెకాలనీ, సుందర్‌నగర్‌కాలనీ, మోడల్‌కాలనీ, సంజీవరెడ్డినగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ వేడుకల్లో జనం మునిగితేలారు. ఇళ్లలో పిండి వంటలు చేసుకుని ఆరగించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా గాలి పటాలను కీంచ్ (దారాన్ని లాగడం) కొట్టడంలో బిజీగా కనిపించారు. జెకెకాలనీలో ఉన్న పలు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భోగి మంటలు వేసి పండుగను ఆహ్వానించారు. ఇక చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. పలు ఇళ్లలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

నిర్మానుష్యంగా రహదారులు..

సంక్రాంతికి ఎక్కువ శాతం కుటుంబాలకు సొంతూర్లకు వెళ్లడంతో రోడ్లన్నీ బోసిపోయాయి. ఎప్పుడూ సాఫ్ట్‌వేర్ కోర్సుల కోచింగ్‌తో హడావిడిగా ఉండే అమీర్‌పేట్ ప్రాంతం పెద్దగా జన సంచారం లేక వెలవెలబోయింది. ట్రాఫిక్‌తో వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేసే అమీర్‌పేట్ మైత్రీవనమ్ చౌరస్తా, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, బేగంపేట్ రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. విద్యార్థులతో సందడిగా ఉండే మైత్రీవనమ్–సత్యం థియేటర్ రోడ్డు విద్యార్థుల హడావిడి లేక మూగబోయింది.



మోడల్‌కాలనీలో..

సందడిగా సంక్రాంతి వేడుకలు



లష్కర్‌లో..

చిలకలగూడ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లష్కర్‌లోని పలు ప్రాంతాల్లో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా పతంగులు ఎగురవేస్తూ ఆటపాటలతో సందడి చేశారు. చిలకలగూడ చింతబావికి చెందిన మ్యాకల చంద్రశేఖర్ పలువురు చిన్నారులకు పతంగులను ఉచితంగా పంపిణీ చేశారు. సీతాఫల్‌మండిలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీ విజేతలకు సికింద్రాబాద్ బీ జేపీ నాయకుడు మేకల సారంగపాణి ప్రోత్సాహక బహుమతులు అందించారు. నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



లాలాపేటలో భోగి మంటలు వేసిన దృశ్యం

లాలాపేటలో..

లాలాపేట: తార్నాక డివిజన్ వ్యాప్తంగా ఆదివారం భోగి వేడుకలను ఆనందోత్సవాలతో నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే ఇళ్ల ముందు భోగి మంటలు ఏర్పాటు చేసి ఇంట్లోని పాత వస్తువులన్నీ ఆ మంటల్లో వేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ భోగి ప్రజలందరి జీవితాల్లో భోగభాగ్యాలు నింపాలని భోగి మంటల చుట్టూ తిరుగుతూ చిన్నా పెద్ద సందడి చేశారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలందరూ తమ తమ ఇళ్ల ముందు సంక్రాతి ముగ్గులు వేశారు. రంగు రంగుల రంగవల్లులతో కాలనీ, బస్తీ రోడ్లన్నీ అందంగా కనిపించాయి. మరో వైపు పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేస్తూ కనిపించారు.



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న మేకల సారంగపాణి



ముగ్గు వేస్తున్న దృశ్యం



చిన్నారులకు పతంగులు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

1969 ఉద్యమకారులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

బంజారాహిల్స్: 1969 తెలంగాణ ఉద్యమకారుల తరపున గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి అంకితభావంతో పనిచేస్తున్న తనకు ఈ దఫా తెలంగాణ ఉద్యమకారుల తరుపున ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుల సమితి సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీని కలిసి విజ్ఞప్తి చేశారు. తాము ఎన్నో కష్టనష్టాలకోర్చి పోలీసులతో దెబ్బలుతిని పోలీసు కేసులు నమోదైనా తెలంగాణ కోసం పోరాడామని, 1969 తెలంగాణ ఉద్యమకారులకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతుందని, కనీసం ఈ సారైనా న్యాయం చేయాలని ఆయన కోరారు. తాను 1967 నుంచి కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్నానని, సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీలతో మంచి అనుబంధం ఉండేదని, తెలంగాణలో కాంగ్రెస్ ఉన్నా లేకున్నా ఆ పార్టీకి నిబద్ధతతో పనిచేశానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పని చేయడం జరిగిందన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులతో పనిచేశానని, గాంధీ భవన్‌కు ఎప్పుడూ కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ఈ సారి ఎమ్మెల్సీ అవకాశం తనకు కల్పించడం ద్వారా తెలంగాణ ఉద్యమకారులను గౌరవించినట్లవుతుందని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ ప్రదానం

ఖైరతాబాద్: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సీఎల్పీ నాయకులు దివంగత పి.జనార్ధన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్‌లో రెండు రోజులుగా నిర్వహించిన పీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీలో జంట నగరాల నుంచి 60 జట్లు పోటీ పడ్డాయి. విజేతగా నిలిచిన శాఖ స్ట్రైకర్స్ (ఖైరతాబాద్) టీంకు ఫౌండేషన్ చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి ట్రోఫీతోపాటు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. రన్నరప్‌గా నిల్చిన ఇమ్రాన్ సీసీ టీంకు ట్రోఫీతో పాటు రూ. 10 వేల ప్రోత్సాహక బహుమతిని ప్రదానం చేశారు.

రోహిత్ వేముల వర్ధంతిని దేశవ్యాప్తంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్: దళిత బహుజన విద్యార్థి మేధావి రోహిత్ వేముల చక్రవర్తి 8వ వర్ధంతి సభలను జనవరి 17న దేశ వ్యాప్తంగా నిర్వహించాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) కేంద్రంగా ప్రజాస్వామ్యం, సెక్యూలర్, రిపబ్లిక్, సోషలిస్ట్ భావజాల వాతావరణాన్ని కాపాడుకోవడం కోసం అంబేద్కర్ ఆశయాలు సాధన కోసం ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఏబీవీపీ దోపిడీ రాజకీయాల పైన తిరుగుబాటు చేసిన గొప్ప మేధావి అని, రోహిత్ వేముల త్యాగాలను,స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

లిబర్టీ: ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ కోరారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించి పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పర్వదినం ప్రతి ఒక్కరిలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ సేవాదళ్ విభాగం తెలంగాణ అధ్యక్షురాలు పుష్పాంజలి, డాక్టర్ లక్ష్మీదేవసేన, నవీన్, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పెయింట్ వేస్తూ జారిపడి కూలీకి గాయాలు

వెంగళరావునగర్: పెయింటింగ్ వేస్తున్న కూలీ జారిపడటంతో గాయాలైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ హసన్ ఆలీ పెయింటర్. ఇటీవల జవహర్‌నగర్‌కు చెందిన సతీష్ అనే వ్యక్తి తన ఇంటికి పెయింటింగ్ వేయడానికి శంకర్, హసన్‌ఆలీలకు కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఆదివారం డాబా పైన అంతస్తుకు హసన్‌ఆలీ పెయింటింగ్ చేస్తుండగా అతను కిందకు పడకుండా తోటి పెయింటర్ శంకర్ తాడును పట్టుకుని ఉన్నాడు. కొద్దిసేపటికి తాడు బరువు ఎక్కువగా ఉండటంతో శంకర్ పొరబాటుగా తాడు విడిచిపెట్టాడు. దాంతో పై అంతస్తు నుంచి హసన్‌ఆలీ కింద పడటంతో అతనికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరోగ్యంగా ఐదు తరాలతో..



శతమానం భవతి.. నిండు నూరేళ్లు ఆనందంగా జీవించు అని అర్థం. ఆ పదానికి ప్రతిరూపంగా నిలిచారు మోడల్‌కాలనీకి చెందిన 101 ఏళ్ల కల్లూరి విమలాదేవి. ఐదుగురు ఆడ పిల్లలు ఆమె సంతానం కాగా మనుమళ్లు, మనుమరాళ్లు, మునిమనుమళ్లు, మునిమనుమరాళ్లు..ఇలా మొత్తం 25 మంది కుటుంబ సభ్యులు. ఐదు తరాలను చూసిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. ఆమె 101 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ఆదివారం సన్మానించారు. – సనత్‌నగర్



శబరిమలకు స్వాములు



శబరిమల వెళ్తున్న మాలధారులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన పలువురు అయ్యప్ప భక్తులు ఆదివారం శబరిమల యాత్రకు తరలివెళ్లారు. 40 రోజుల పాటు భక్తితో అయ్యప్పను కొలుస్తూ నిష్ఠతో దీక్ష చేపట్టిన భక్తులంతా లాలాపేటలోని అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు తలపై పెట్టుకుని పయనమవుతుండగా కుటుంబ సభ్యులంతా వారికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్ ఆధ్వర్యంలో 35 మంది మాలధారులు శబరిమలకు వెళ్లారు.

పతంగుల పంపిణీ

కాచిగూడ: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో విద్యార్థులకు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి పతంగులు (కై ట్స్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరాటే బ్లాక్ బెల్ట్స్ అమృతరెడ్డి, ఘన సంతోషిణి, యోగిని, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బస్తీ నేతలు

లాలాపేట: తార్నాక చింతల్ బస్తీలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం 135 వారం బహుజన నేతలు జ్ఞానమాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల్లో జన్మించిన అంబేడ్కర్ ఉన్నత చదువుల ద్వారానే ప్రపంచ మేధావిగా గుర్తించబడ్డారన్నారు. దళిత బహుజనులంతా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రతి వారం జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల్ లక్ష్మణ్, ప్రసన్న అప్సర్, యాదగిరి, మనోహర్ పాల్గొన్నారు.

వైభవంగా అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

సనత్‌నగర్: రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సరఫరా చేసిన అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌లో వైభవంగా జరిగింది. ముందుగా కాలనీ పార్కు నుంచి ప్రారంభమైన ఊరేగింపు మహోత్సవం అన్నీ వీధుల్లో కొనసాగింది. ఊరేగింపు పొడవునా జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగగా కాలనీ పరిసరాలు ఆధ్యాత్మిక సంద్రంలో మునిగితేలాయి. భక్తులు భక్తిప్రపత్తులతో హారతులు పట్టి అక్షింతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంజయ్ చల్లా, కోశాధికారి చంద్రశేఖర్, విశాల్ సూదం, నరేష్‌భట్ పాల్గొన్నారు.

కమనీయం.. గోదా రంగనాథుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు



ప్రసన్న వెంకన్నస్వామి ఆలయంలో..



గోదాదేవి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ధనుర్మాసంలో జరిగే ఈ వేడుకను వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో అలరారాయి. సనత్‌నగర్, జెకెకాలనీ, ఎస్ఆర్‌టీకాలనీ, శివాజీనగర్, తులసీనగర్, ఉదయ్‌నగర్, మోడల్‌కాలనీ, సుందర్‌నగర్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం కొనసాగింది.

శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించి, మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి కల్యాణం జరిపించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 15వ తేదీ మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. మరింగంటి విజయకుమార్ ఆలపించిన తిరుప్పావై ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్, రామచందర్ పాల్గొన్నారు.

బోసిపోయిన రహదారులు

సంక్రాంతికి నగరవాసులంతా పెద్ద ఎత్తున వారి వారి స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో నిత్యం ఎంతో రద్దీగా కనిపించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, సోమాజిగూడ రహదారులన్నీ బోసిపోయి కనిపించాయి. ఏ కూడలిలో చూసినా క్షణం కూడా ఆగకుండా వాహనాలు ముందుకు కదిలాయి. – బంజారాహిల్స్



బంజారాహిల్స్ రోడ్ నెం. 2లో...



వేడుకగా మల్లన్న జాతర



ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి (మల్లన్న) జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్‌ముదిరాజ్, పూస గోరఖ్‌నాథ్, జెల్లా భిక్షపతి తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగతెప్ప ఊరేగింపు, గొలుసులు తెంపుట తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి అతిథులను సన్మానించారు. బీజేపీ నాయకులు ఆర్.విశ్వం, కృష్ణ, భాస్కర్‌గౌడ్, నందగిరి నర్సింహ, రామానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.